# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**DECEMBER - 2015**

సంవత్సర చందా రూ. 50/-

# టి.వి ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6:30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2:30 గంటలకు రక్షణ |
| ప్రతి ఆదివారం ఉదయం | : | 7:00 గం॥ మనకాపరి టి.వి (తెనాలిగుంటూరు ఏరియాలో) |
| ప్రసంగీకులు | : | **జాషువా గూటం** |
| | | **రిక్కీ గూటం** |
| | | **రోనీ గూటం** |

పై కార్యక్రమములను టి.విలో చూడండి. మీ బంధు మిత్రులను కూడ ప్రోత్సహించండి. ఉచిత బైబిలు కోర్సుకొరకు మాకు ఈరోజే వ్రాయండి


SATYA VANI

P.O.BOX.80, KAKINADA

Pin : 533004

Ph : 0884 -2363722

98489 98547

www.satyavanicoc.com

# సత్యవాక్యు
## THE WORD OF TRUTH
P.o. Box -80, KAKINADA,A.P. 533 001
Ph : 0884 - 2363722, 98489 98547

Editor :
**Joshua Gootam**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి - 36 | డిశంబరు- 2015 | సంచిక -5


## సువార్తకు లోబడుట
### *(Obeying the Gospel)*

సువార్తకు లోబడుట అను పదము క్రొత్తనిబంధనలో మనకు పదే పదే కన్పడుచున్నది. మన ప్రభువైన **యేసు** సువార్తకు లోబడని వారికి ఆయన మరల వచ్చునప్పుడు ప్రతిదండన జరుగునని 2 థెస్స 1:7 లో వ్రాయబడి యున్నది. మరల, "తీర్పు దేవుని ఇంటి యొద్ద ఆరంభమయితే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమవును?" అని 1పేతురు 4:17లో వ్రాయబడి యున్నది. సువార్తకు లోబడుట, అసాధ్య మని కొందరు వాదింతురు గాని బైబిలు అయితే సువార్తకు లోబడుట, విధేయుల గుటను గూర్చి బోధించుచున్నది. సువార్తలో నమ్ముటకు వాస్తవములు, లోబడుటకు ఆజ్ఞలు ఉన్నవి.

సువార్తలోని వాస్తవములను ఒకసారి బైబిలు నుండి చూచుకొందము. పౌలు ఇట్లు పలుకుచున్నాడు. "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను, సమాధిచేయ బడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను"(1 కొరింథి 15:1-3).

సువార్తలోని వాస్తవములు

ఏమిటి?అవి క్రీస్తు మృతిబొందెను, సమాధి చేయబడెను.మూడవదినమున తిరిగి లేపబడెను అనునవి.అయితే రోమాలో యున్న క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసెను. “మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో,దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైరి. ఇందుకు దేవునికి స్తోత్రము”(రోమా 6:17,18).వారిలో ఈ మార్పు ఎట్లు కలిగెను?వారు ఒక ఉపదేశక్రమమునకు హృదయపూర్వకముగా లోబడినందున ఈ మార్పువారిలో కలిగెను.ఇంకొక మాటలో,వారు సువార్తకు లోబడినందున వారిలో ఈ మార్పు కలిగెను.ఇక్కడ చెప్ప బడిన ఉపదేశక్రమమే క్రీస్తుయొక్క మరణము,సమాధి,పునరుత్థానముల వాస్తవములు.అయితే ఈ వాస్తవములకు వారు ఎట్లు లోబడగల్గిరి?వారుతమ పాపముల విషయమై మృతిబొందిరి. బాప్తిస్మము ద్వారా నీటిసమాధిలో పాతిపెట్టబడిరి. దాని నుండి తిరిగి లేపబడిరి.ఈ సంగతినే పౌలు రోమా 6వ అధ్యాయములో వారికి తెలియజేసెను. “అలాగైన ఏమందుము? కృపవిస్తరింప వలెనని పావమందు నిలిచి యుందుమా? అట్లనరాదు.పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించు దుము? క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తుమృతులలో నుండి యేలాగు లేపబడెనో, అలాగే మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతి పెట్టబడితివి. మరియుఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమై యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పావశరీరము నిరర్థకముగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము'' (రోమా 6:1-6).రోమాలో యున్న క్రైస్తవులు విధేయత చూపిన ఉపదేశము యిది.అంతేకాదు ఎప్పుడైన ఎవరైన సువార్తకు లోబడినప్పుడు వారు క్రీస్తు యేసు యొక్క మరణ,సమాధి.పునరుత్థా నముల ఉపదేశ క్రమమునకు లోబడు దురు.

సువార్త యొక్క ఆజ్ఞలు క్రీస్తు యేసు యొక్క మరణ,సమాధి,పునరుత్థానములకెట్లు సంబంధించియున్నవో ఇప్పుడు చూచెదము:"మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి నమ్మిబాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును"అని ప్రభువే అపొస్తులుల కాజ్ఞాపించెను(మార్కు 16: 15,16).ఆ యాజ్ఞను మత్తయి ఇట్లు వ్రాసెను,"కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి, తండ్రి యొక్కయు,కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నింటి గైనకొనవలెనని వారికి బోధించుడి.ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను"
(మత్తయి 28: 19,20).

సువార్తలోకమందంతటా బోధింపబడవలెనని,రక్షించబడుటకు ఆ సువార్త ఆజ్ఞలకు ఒకడు లోబడవలెనని ప్రభువు ఇక్కడ చెప్పుచున్నారు.ప్రభువు యొక్క ఆజ్ఞప్రకారము అపొస్తులులు యెరూలేము నుండి సువార్త బోధింపనారంభించిరి.యేసు నిజముగా దేవుని కుమారుడను అనేక ఋజువులను వారు ప్రజలకు సమర్పించిరి. వారా సంగతుల యదార్థతను నమ్మినప్పుడు,సహోదరులారా మేమేమి చేతుము?అని వారు అపొస్తలుల నడిగిరి (అపొ.కా. 2:37). ఏమి చేయవలెనో పేతురు వారికిట్లు జవాబిచ్చెను."మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38). "కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి.ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి"(అపొ.కా 2:41).

సువార్త యిచ్చు ఆజ్ఞలేవి? మొదటిగా ఒకడు సువార్తను వినవలెను. అతడు దేవుని యందు విశ్వసించవలెను. యేసు దేవుని కుమారుడని నమ్మవలెను. తరువాత అతడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. తన విశ్వాసమును మనుష్యుల యెదుట నోటితో ఒప్పుకొనవలెను. తన పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడవలెను.

సువార్తయిచ్చు ఈ ఆజ్ఞలకు లోబడుటలో ఒకడు తన పాపముల విషయమై మృతిబొందును. అనగా

సువార్తను వినగా క్రీస్తునందున్న విశ్వాసమును బట్టి అతడు తన పాపములను సంపూర్తిగా విసర్జించును. అతడు పాపముల నుండి ఎడబాటుపొందును. ఇది పాపముల యెడల మరణము పొందుటను సూచించును. మరణము తరువాత సమాధి జరుగవలెను. ఇది నీటి సమాధి. బాప్తిస్మము పొందినప్పుడు ఒకడు నీటిలో సంపూర్తిగా ముంచబడును. "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడిన వారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి"యని కొలస్స 2:12లో వ్రాయబడియున్నది. క్రీస్తు సమాధిని జయించి ఎట్లు లేచెనో దానికి సాదృశ్యముగా బాప్తిస్మము పొందువాడు నీటి సమాధినుండి లేవబడును. గనుక ఒకడు సువార్తకు లోబడునప్పుడు క్రీస్తు యొక్క మరణ సమాధి,పునరుత్థానములను సారూప్యముగ చిత్రించును. సువార్త యిచ్చు ఆజ్ఞలకు లోబడువారు దేవుని నుండి యీవులను పొందుదుర[illegible]ర్త యిచ్చు ఆజ్ఞలలో దేవుని మనము నిర్లక్ష్యము చేయరాదు. సువార్త ఆజ్ఞలకు లోబడిన తరువాతనే ప్రభువు ఒకని రక్షించి తన సంఘముతో చేర్చుకొనును.

అందరికీసువార్త బోధింపబడవలెను. అందరు సువార్తకు లోబడవలెను అని ప్రభువు కోరుచున్నారు. "అందరు సువార్తకు లోబడలేదు"అని పౌలు రోమా 10:16లో విచారించుచున్నాడు. అయతే సువార్తకు విధేయులుకాని వారికి ప్రతిదండన తప్పదని అతడు హెచ్చరించుచున్నాడు. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని క్రీస్తు చెప్పెను. "కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగి యుండవలెను. ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడి నందున,ప్రతి అతిక్రమమును,అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొంది యుండగా ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల యేలాగు తప్పించుకొందుము.?"(హెబ్రీ 2:1,2). నీవు సువార్తకు లోబడితివా? లేనియెడల ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము. పాపముల విషయమై మారుమనస్సు నొందుము. యేసు నామమును ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము ఈనాడే బాప్తిస్మము పొంది,సువార్తకు విధేయుడవై ధన్యుడవు కమ్ము.

# గొప్పప్రాయశ్చిత్త దినము - I
## *(Great Day of Atonement-1)*

గొప్ప ప్రాయశ్చిత్త దినమున జరిగే బలులను గూర్చియు వాటి విధివిధానములను గూర్చియు యున్న హెచ్చరికలను ఈపాఠములో తెలిసి కొందము.లేవీ 16:1-34లో దీనిని గూర్చిన హెచ్చరికలన్నియు యున్నవి. సంఖ్య 29:5-11లోను,31:50లోను కూడ దీనిని గూర్చి చెప్పబడి యున్నది.

యామ్ కిపూర్(*Yom kippur*)

ప్రాయశ్చిత్త దినమును హెబ్రీ భాషలో యామ్‌కిపూర్ అనియందురు. యామ్‌కిపూర్ అనగా కప్పబడుదినము (the day of covering)అని యర్థము. హెబ్రీ భాషలో కఫార్ అనగా కప్పుట అని యర్థము.ఆదికాండము 6:14లో అదే మాటవాడబడినది.ఓడకు బయటను వెలుపటను కీలుపూయుమని దేవుడు నోవహుతో చెప్పారు. గనుక ప్రాయశ్చిత్త దినమందు హెబ్రీయుల ఆరాధనలోని అనేక సంగతులు మరియు పాపవియోచన మొ॥గు సంగతులు జరుగును. ఆ రోజు జరుగు క్రియలన్నిటిలోను యేసుక్రీస్తు పని రూపకాలంకారముతో నిండి యున్నవి.హెబ్రీయుడైన ప్రతివాడు దానిలో వ్యక్తిగతముగా పాల్గొని, అదంతయు తనకొరకే జరుగుచున్నదని భావించవలెను.

దేవునికి ఆయన నిబంధన ప్రజలకును మధ్య ప్రాయశ్చిత్తదినము రూపకాలంకారవిమోచనము,సమాధానముగా అగుపడును.ఆ రోజు జరుగు బలులు, ప్రధానయాజకుని విధులు దేవునికిని, ఆయన నిబంధన ప్రజలకు మధ్యయున్న సహవాసమును కొనసాగించుట కొరకు అవుసరమై యున్నవి.

ప్రాయశ్చిత్త దినమే ఎందుకు?

ప్రాయశ్చిత్తదినమును వర్ణించు అనేక కారణములు కలవు.మొదటిగా దేవుడు పాపమును పరిగణించునట్లు అది పాపపరిహారమును సమర్పించును. మానవుని అజ్ఞానమువలన అతడు అతిక్రమించిన అనేక చట్టములున్నవి. ఏదిమంచిదో ఏదిచెడ్డదో నిర్ణయించు కొనుటకు మానవునికి చేతకాదు. పాపి యైనవాడు తరచు తనపాపములను ఎరిగిన వాడుకాదు.తెలియక,అజ్ఞానము వలనచేసిన పాపములను గూర్చి లేవీ 4:2,13,22,27;5:15లో చెప్పబడి యున్నది.గనుక మానవుడు తన పాపముల విషయమై ఎరుక కలిగినవాడు కాకపోయినను,దేవుడు మాత్రము వాటిని ఉపేక్షించరు.అట్టిపాపము సయితము

బలియాగ రక్తముతో కప్పబడవలెను.

ఇశ్రాయేలీయుల బలియర్పణ పద్ధతి వలన పాపము యొక్క సమస్య నిజముగా తీరిపోవుట లేదని ఇశ్రాయేలీయులు గ్రహించుకొన వలసి యుండెను. వారి బలియర్పణ పద్ధతి అంతా ఛాయ రూపకమే. దానిలోయున్న విధి విధానములన్నియు భవిష్యత్తులో జరుగుబోవు ఒకగొప్పబలియాగమును సూచించుటకుపయోగపడుచున్నవి. ఆదినమున జరుగుప్రతి సంగతి కల్వరి సిలువపై సంపూర్తియైన యేసుయొక్కబలి యాగమును సూచించెను. మరియు ప్రధాన యాజకునిగా యేసు చేయుచున్న పనినికూడ అది సూచించెను.

**సార్వజనిక పరిహారము**

ఆదినమందు సార్వజనిక పాప పరిహారము ప్రాముఖ్యమైనది. అందులో యాజకుల యొక్క అతిక్రమములు పాపములు మాత్రమే గాక ఇశ్రాయేలు జనాంగ మంతటి పాపములు కూడ యిమిడి యుండెను. అహరోను, అతని కుటుంబము సర్వసమాజము ప్రాయశ్చిత్త దినములలో పాత్రవహించవలెను. చివరకు అతి పరిశుద్ధ స్థలము కూడ ప్రజల యొక్క పాపముల వలన అపవిత్ర పరచబడెనేమో యని, అదికూడ పరిశద్ధ పరచబడవలెను. ప్రత్యక్షగుడార ఆవరణములో యున్న దహనబలి పీఠము కూడ, అక్కడ అనేక పాపముల అలంకారరీతిగా కప్పబడెను. గనుక పరిశుద్ధ పరచబడవలెను. దేవుడు సయితము ఆయన అతిపరిశుద్ధుడైనను, పాపులైన జనాంగము మధ్యనివసించు చుండెను. ఇశ్రాయేలీయులతో దేవుని యొక్క సహవాసమును బట్టి వారి పాపములో ఆయనకు పాత్రయున్నదనే భావన ఎన్నడు కలుగకూడదు. అందు వలన దేవుని నివాస స్థలము అపవిత్రత నుండి పవిత్రపరచబడవలెను. ఆయన పరిశుద్ధతను అందరు గ్రహించవలెను.

**ఒక పాపమునకు ఒక బలి సరిపోదు**

ఒక పాపమునకు ఒక బలి యర్పించు విధానము వలన ప్రజల యొక్క అవుసరతలు తీరవు అని దేవుడు ఇశ్రాయేలీయులకు నిరూపించదలచారు. సరిగదా అది దేవుని అవుసరతలను కూడ అసలే తీర్చదు. గనుక ప్రతిదినము జరిగించు పాపములకు ప్రతిదినము అర్పించబడు బలులు కేవలము నిష్ప్రయోజనము. పాపపు సమస్యను సంతృప్తికరముగా తీర్చుటకు అవిసరి పడవు. మరియు ప్రజలు ధర్మశాస్త్రమును గూర్చిన పూర్తి అవగాహన లేనివారై నందున ఆ సమస్య మరింత తీవ్రమైన దాయెను. గనుక ప్రజలందరి పాపములు

పరిగణించబడి సంపూర్తిగ కప్పబడు ప్రాయశ్చిత్త దినము వారికి అవసర మాయెను.

ప్రజలందరి పాపములకు,అతి క్రమములకు సరిపడు రీతిగా అర్పింప బడుటకు ఇశ్రాయేలీయులలో కావలసినన్ని జంతువులు లేవనుట విదితమే.

**దేవుని పరిశుద్ధత దృఢపరచబడవలెను.**

ప్రాయశ్చిత్తదినమున దేవుని పరిశుద్ధత దృఢపరచబడవలెను.ఆయన అనీతిమంతులతో పని చేయుచున్నందున ఆయన యొక్క నీతి స్థిరపరచబడవలెను. ఆయన ఇశ్రాయేలీయుల మధ్య ఉంటు, వారితో సహవాసము కలిగియుండెను. అందును బట్టి వారిపాపములలో కూడ ఆయనకు భాగమున్నదనే అభిప్రాయము కలుగవచ్చును.యేసు పాపులమధ్య సంచ రించు చుండగా యూదులు ఆయనను గూర్చి అట్లే తలంచిరి(లూకా 15:1-2; మత్తయి 11:19).నిజానికి మానవుని యొక్క ప్రతిపాపము కప్పబడితేనే,అతడు దేవునితో సహవాసము కలిగి యుండ గలడు.అందువలన ప్రాయశ్చిత్తదినము అవుసరము.

పాపులైన మానవుల మధ్య దేవుడు తన నివాసము నేర్పరచు కొనియున్నారు.ప్రాయశ్చిత్త దినమందు అహరోను పాపపరిహారార్థ మేకను వధించి దాని రక్తమును"కరుణాపీఠము మీదను,కరుణాపీఠము ఎదుటను దాని ప్రోక్షింపవలెను.అట్లు అతడు ఇశ్రాయేలీ యుల సమస్త పాపములను బట్టియు అనగా వారి అపవిత్రతను బట్టియు వారి అతిక్రమములను బట్టియు పరిశుద్ధ స్థలమునకు ప్రాయశ్చిత్తము చేయవలెను. ప్రత్యక్షగుడారము వారి మధ్య ఉండుట వలన వారి అపవిత్రతను బట్టియు వారి అతిక్రమములను బట్టియు పరిశుద్ధ స్థలమునకు ప్రాయశ్చిత్తము చేయవలెను. ప్రత్యక్షగుడారము వారి మధ్య ఉండుట వలన వారి అపవిత్రను బట్టి అపవిత్ర మగుచుండును గనుక అతడు దానికి ప్రాయశ్చిత్తము చేయవలెను"(లేవీ 16: 15-16).మరల అతడు ప్రజల నిమిత్త మైన వధించబడిన మేక రక్తముతీసుకొని ఆకోడె రక్తముతో చేసినట్లు దీని రక్తముతో చేయవలెను."అతడు కోడె రక్తములో కొంచెమును,మేక రక్తములో కొంచెమును తీసుకొని బలిపీఠపు కొమ్ముల మీద చమిరి యేడుమారులు తన వ్రేలితో ఆ రక్తములో కొంచెము దాని మీద ప్రోక్షించి దాని పవిత్రపరచవలెను''(లేవీ 16:18-19).దేవునికేమైన అపవిత్రత ఆపాదించబడకుండునట్లు ఇట్టి సంస్కా రములు విధించబడెను.ప్రశ్చాత్తాపదిన

మందు వధించబడే బలులన్నియు క్రీస్తు ను సూచించుచున్నవి. మరియు ప్రధాన యాజకుడు అతని విధులు యేసుక్రీస్తు యొక్క నిజమైన ప్రధానయాజకత్వముకు సూచనగా యున్నవి.

ఇశ్రాయేలీయులు తమ పాపము నిమిత్తమై మారుమనస్సు పొందవలెనని దేవుడు కోరారు. యామ్ కిపూర్‌లో దేవుడు తమ పాపములను నిర్మూలించారనే ధైర్యమును వారు పొందగలిగిరి. "నేను కరుణాపీఠము మీద మేఘములో కనబడుదును"అని దేవుడు వారికి చెప్పారు(లేవీ 16:2). కరుణా పీఠము నుండియే దేవుడు ఇశ్రాయేలీ యులకు క్షమాపణ ననుగ్రహించెను. ఆయన కృప కనికరము గల దేవుడని తన ప్రజలు తెలిసికోవాలని దేవుడు కోరారు.

ఆ దినమున జరిగించు ప్రతిసం గతి దేవుని కొరకైనదని ప్రజల మనస్సు లలో ముద్రితముకావలసి యుండెను. నిజానికి ప్రజలు ఆయన ధర్మశాస్త్రమునే అతిక్రమించిరి గనుక ఆయన శాంతింప జేయబడవలెను. దేవుడు కరుణాపీఠము మీద మేఘములో కనబడెను. ఆయన ప్రజల ప్రాయశ్చిత్తార్థబలులు నంగీక రించిరి. ప్రజల యొక్క ఒక యేట జరిగిన పాపములను కల్వరిపైకి పంపించుటకు దేవుడు ఆసక్తికలిగి యుండెను. పాపములను భరించు యేసుయొక్క కృషిని రూపకముగా దేవుడు ఇశ్రాయేలీలకు తెలియజేయగోరెను.

ఆదినమందే ఇశ్రాయేలీయుల పాపములు క్షమించబడినను అవి కప్పబడ లేదను మనము అర్థము చేసికోవాలి. వారి పాపములు మరోక సంవత్సరము ముందుకు కొనసాగించబడెనని లేవీకాండము, హెబ్రీవత్రిక కూడ తెలియజేయుచున్నవి. ఇశ్రాయేలీయుల పాపములు ఈ సంవత్సరము నాటి ప్రాయశ్చిత్త దినమున వారికి క్షమించబడి యున్నదని వారి యభిప్రాయము. యేసుక్రీస్తు సిలువపై బలి అయ్యేవరకు యేటాటజరుగు ఈ పద్ధతి కొనసాగించ బడెను.

"ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలులఛాయగలదియే గాని ఈ వస్తువుల నిజస్వరూపము గలది కాదు గనుక ఆ యాజకులు ఏటేట ఎడతెగకుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని, వాటిని తెచ్చువారికి ఎన్నడు సంపూర్ణ సిద్ధికలుగ జేయనేరవు. ఆలాగు చేయగలిగిన యెడల సేవించువారొక్కసారే శుద్ధవరచబడిన తరువాత వారి మనస్సాక్షికి పాపజ్ఞప్తి ఇకను ఉండదు గనుక వాటిని అర్పించుట మానుదురు

గదా.అయితే ఆ బలులు అర్పించుట చేత ఏటేట పాపములు జ్ఞాపకమునకు వచ్చు చున్నవి.ఏలయనగా ఎడ్లయొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము"(హెబ్రీ10:1,4

**ఆ రక్తముతోకాదు అయినను ఆ రక్తముతోనే:**

"మరియు ధర్మశాస్త్రప్రకారము సమస్త వస్తువులు రక్తముచేత శుద్ధిచేయ బడుననియు రక్తముచిందింపకుండ పాప క్షమాపణ కలుగనేరదనియు సామాన్య ముగా చెప్పవచ్చును" (హెబ్రీ 9:22). వాగు జంతురక్తము వలన క్షమించబడ లేరు,అయినను ఆ రక్తము లేకుండ కూడ క్షమించబడలేరు!"నమ్మిబాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని"యేసు చెప్పెను (మార్కు 16:16). అపో.కా. 2:38;22:16;1వపేతురు 3:21లను చదివితే బాప్తిస్మము పొందినవాని పాపములు క్షమించబడునని గ్రహించ గలము.అయితే ఒకడు పొందేబాప్తిస్మపు నీటిలో పాపములు క్షమించబడునని ఎవరు తలంచరు. బాప్తిస్మములో పాపియైనవాడు క్రీస్తురక్తము దరికిచేరు కొనును.రక్షించేది నీరు కాదు గాని యేసు రక్తము.అదే రీతిగా పాపక్షమాపణ కొరకు దేవుని యేర్పాటును హెబ్రీయుడు కూడ అంగీకరించి రక్తబలులునర్పించెను. తనకు బదులుగా అర్పింపబడే జంతుబలి రక్తము ద్వారా కల్వరి విమోచనతో సంబంధము ఏర్పాటు చేసికొనెను. భావిలో జరుగు క్రీస్తు బలియాగముతో ఆత్మీయముగా సంబంధ మేర్పరచు కొనెను.ఆయన రక్తమే వానిని క్షమించెను. గనుక దేవుడు ఆ హెబ్రీయులను క్షమించినప్పుడు సిలువ దృక్పధముతో క్షమించెను. వారి జంతుబలుల ద్వారా వారి పాపక్షమాపణను ఒక ప్రామిసరీ నోటుగా వ్రాసియిచ్చినట్లు యిచ్చెను

**క్రీస్తు హెబ్రీయుల పాపములను కప్పెను**

"మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచ నము కలుగుటకై ఆయన మరణము పొందినందున,పిలువబడినవారు నిత్య మైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానము పొందునిమిత్తము ఆయన క్రొత్తనిబంధ నకు మధ్యవర్తియై యున్నాడు"అని హెబ్రీ 9:15 చెప్పుచున్నది.ఇంకొక మాటలో క్రీస్తుచనిపోయినప్పుడు ఆ పాతనిబంధన ప్రామిసరీ నోట్లన్నిటినీ తీర్చివేసారు. ఆయన వారి పాపములను విమో చించారు.

**యామ్ కిపూర్ యొక్క ముఖ్యాంశములు**

తమపాపములు క్షమించ బడెనని హెబ్రీయుడు ఎరిగియుండెను. ఒకడు తన నిమిత్తము ప్రాయశ్చిత్తము

కలుగునట్లు బలియర్పించిన యెడల అది అతని పక్షముగా అంగీకరింపబడునని లేవీ 1:4 చెప్పుచున్నది. లేవీ 4:20,31, 35;5:6 అతడు అక్కడే క్షమించబడెనని మొదలిడ లేదు గాని క్రీస్తుమరణము ఆయన ముందుగా చేసిన క్షమాపణను నీతిగా యెంచుచున్నది.

మోషేధర్మశాస్త్రము లేకముందు నుండే దేవుని యెదుట నీతిమంతులుగా ఎంచబడినవారున్నారు. దేవుడు అబ్రాహామును తన క్రియలవలన గాక అతని విశ్వాసము వలన నీతిమంతుడుగా ఎంచెనని రోమా4వ అధ్యాయము తెలుపు చున్నది.

**ఏడవనెల పదియవదినము**

సంవత్సరములో ప్రాయశ్చిత్త దినము జరిగించు సమయము ప్రాముఖ్యము. అది ఏడవ నెల పదియవ దినమున జరుగవలెను(లేవీ 16:29). ఈ రెండు సంఖ్యలు హెబ్రీయులకు ముఖ్యము ఏడు,పది,దేవుని పని సంపూర్తియగుట 10 సూచించు చున్నది. జలప్రళయముకు ముందు పదిమంది గోత్రకర్తలుండిరి, సొదొమ పట్టణమును రక్షించగల 10మంది ఉంటే సరిపోవును,ఐగుప్తులో 10 తెగుళ్లను దేవుడు రప్పించెను. మోషే ధర్మశాస్త్రము లోని 10ఆజ్ఞలు ముఖ్యమైనవి. సంపూర్తిచేయబడిన దేవుని పనిని 7 సూచించును. గనుక ఈ రెండింటిని మనము కలిపి చూచిన యెడల విమోచనను సాధించు దేవుని పనినినంత టిని మనము చూడగలము. సబ్బాతులో కూడ ప్రజలయొక్క పరిపూర్ణవిమోచనము వారి యొక్క నిత్యవిశ్రాంతి సూచించు చుండెను.

**యాజకులు,ప్రజలు సిద్ధపడుట**

ఆదినమందు యాజకులు, ప్రజలు కూడ ప్రత్యేకముగా సిద్ధపడి యుండవలెను. ప్రజలందరు దు:ఖభావములతో సమావేశము కావలసి యుండెను (లేవీ 16:29-34).

అది మహా విశ్రాంతి దినమని లేవీ 23:26-32లో చెప్పబడెను. ఆ దినమున వారు ఏ పనియు చేయకూడదు. వారు తమ్మును తాము దు:ఖపరచుకొనిన ప్రతివాడు ప్రజలలోనుండి కొట్టివేయ బడును (లేవీ 23:29-30).

అహరోను ఆ దినము కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయవలెను. మిగత యాజకులందరు ప్రజలతో కలసి ప్రత్యక్ష గుడారము వెలుపల ఆవరణములో యుండవలెను. పాపులైన జనాంగముతో కలసి వారును ఆదినమందు సమాధానముగాయుందురు. అహరోను

ఒక్కడు మాత్రమేవారి కొరకు ప్రాయశ్చిత్తము చేయును.ప్రతి హెబ్రీయుడు అదిన చర్యలన్నిటిలోను మానసికముగాను, ఆత్మీయము గాను,భౌతికముగాను పాలు పంచుకొనవలెను.నిరాకరించువాడు ప్రజలలోనుండి కొట్టివేయబడును!

## పూర్వము వ్రాయబడినవన్నియు
## *(Every thing written in the Past)*

క్రీస్తు సంఘసభ్యులు క్రొత్తనిబంధన క్రైస్తవులమని చెప్పుకొనుటకద్దు. దీనిని బట్టి వారికి పాతనిబంధన అంతప్రాముఖ్యము కాదనే భావన కొందరికి కలుగును. యేసుప్రభువు ధర్మశాస్త్రమును నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు రాలేదని చెప్పారు(మత్తయి 5:17). పాతనిబంధన ప్రాముఖ్యమని యేసు పదేపదే బోధించారు. ఆయన ఆత్మీయ ఎదుగుదలలో పాతనిబంధన ఎంత ముఖ్యమైనదో ఆయన జీవితమే గొప్పసాక్ష్యము.

పాతనిబంధన యొుక్క ప్రాముఖ్యతను క్రొత్తనిబంధనలో మనము కనుగొనగొందుము. అపొ.పౌలు 2తిమో 3:16లో ఇట్లు బోధించాడు."దైవజనుడు సన్నద్ధుడై ప్రతిసత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును,తప్పుదిద్దుటకును,నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైయున్నది"(2తిమో 3:16-17).

పౌలుక్లియర్‌గానే చెప్పాడు. ఆత్మీయాభివృద్ధికి లేఖనములు అత్యంత ప్రాముఖ్యము.అయితే మనకు క్లియర్ కానిదేమంటే అతడు చెప్పిన లేఖనమును మనము నేడు పాతనిబంధన యని చెప్పుచున్నాము._ పౌలుకాలములో క్రొత్త నిబంధన ఇంకా లిఖింపబడియుండలేదు. అయితే అప్పటికింకా వ్రాయబడుచు, సంగ్రహించబడలేదని లేఖనములు కూడ అతని మనస్సులో ఉండియుండవచ్చును. గాని అతని కాలపు విశ్వాసులు లేఖనమును గూర్చి విన్నప్పుడు,యూదుల లేఖనములగు ధర్మశాస్త్రము,ప్రవక్తలు, కీర్తనల గ్రంధాన్నే తలంచుకొనేవారు. నిజానికి క్రొత్తనిబంధనగా తదుపరి పరిచయము చేయబడిన లేఖనములలో ఎక్కువ పాతనిబంధనే యున్నది.

బైబిలు పండితుల అంచనాను బట్టి పాతనిబంధనలోని 340 లేఖన భాగములు క్రొత్తనిబంధనలో నేరుగా ఉపయోగించబడ్డాయి.మరియు పాత

నిబంధన సందర్భములు 2300 సార్లు క్రొత్తనిబంధనలో ఎత్తిచూపబడ్డాయి. మన ఆత్మీయ ఉద్బోధన కొరకు మనము పాతనిబంధనను చదువాలని పౌలు మనలను హెచ్చరించుచున్నాడు. "ఏలయనగా ఓర్పువలనను,లేఖనముల వలన ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి"(రోమా 15:1-4).

మార్కు తానువ్రాసిన సువార్తను యెషయాసువార్త వలె ప్రారంభించాడు (మార్కు 1:1-2).పౌలు రోమా 1:17లో హబక్కూకు మాటలను ఎత్తివ్రాసాడు: "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును''(హబక్కూకు 2:4). యెషయాచెప్పిన మాటలను అతడు ఫిలిప్పీ2:10-18లో ఎత్తి వ్రాసాడు, ''ప్రతివాని మోకాలు వంగును, ప్రతినాలుక ఆయనను ఒప్పుకొనును" (యెషయా 45:23).మరల యెషయా మాటలనే అతడు 1కొరింధీ 2:9లో వాడాడు: "దేవుడు తన్ను ప్రేమించు వారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు,చెవికి వినబడ లేదు మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" (యెషయా 64:4).తదుపరి అదే పత్రికలో అతడు హోషేయ13:14ను ఎత్తి వ్రాసాడు "ఓ మరణమా నీవిజయ మెక్కడ?ఓమరణమా నీముల్లెక్కడ? (1 కొరింధీ 15:55). 1వపేతురు 1:16లో పేతురు మోషే మాటలను ఎత్తి వ్రాసాడు."నేను పరిశుద్ధుడనై యున్న ప్రకారము మీరును పరిశుద్ధులై యుండుడి"(లేవీ 11:44).యెషయా చెప్పిన మాటలను 1పేతురు 1:24-25లో పేతురు ఉపయోగించాడు: "సర్వశరీరులు గడ్డిని పోలిన వారు, వారి అందమంతయు గడ్డిపువ్వు వలె యున్నది. గడ్డిఎండును దాని పువ్వునురాలును; అయితే ప్రభువు వాక్యము నిత్యము నిలుచును"(యెష 40:6-8).యాకోబు సామెతల గ్రంథ ములోని మాటలను ఎత్తివ్రాసాడు: "దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృపచూపును''(యాకోబు 4:6;సామెతలు 3:34).క్రొత్తనిబంధన క్రైస్తవులుగా యుండుట మంచిదే అయితే పాతనిబంధనను ఎరుగనంత వరకు మనం సంపూర్తిగా క్రొత్త నిబంధన క్రైస్తవులముగా యుండలేము.

పాతనిబంధనను చదువుటకున్న ఒక ముఖ్యకారణం యేమంటే,మన ప్రభువైన యేసుక్రీస్తు పాతనిబంధన లేఖనములనే వినియోగించారు!యేసు పెరుగుచుండగా మరియు ఆయనకు

నేర్పిన లేఖనములు అవియే. సమాజ మందిరములలో బోధింపబడు చుండగా యేసు వినిన లేఖనములు అవియే. ఆయన బోధకు రూపకల్పన చేసిన లేఖనములు అవియే. అందువలననే ఆయన ధర్మశాస్త్రమును నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు రాలేదని చెప్పారు. మనం యేసు ధ్యానించినలేఖనములను ధ్యానించడం అవుసరం.మరియు యేసు ఏ లేఖనముల వలన నడిపింపబడి, శక్తిని పొందారో అదే లేఖనములు మనకును సహాయపడగలవు.

**శోధన జయించుటకు లేఖనము**

యేసు బాప్తిస్మము పొందిన వెంటనే ఆయన అరణ్యమునకు కొని పోబడ్డారు.నలువది దినములు ఉపవాసముండి అత్యంత తీవ్రమైన ఆత్మీయ శిక్షణనొందారు.అక్కడ తండ్రిని, ఆయన చిత్తాన్ని కనుగొన్నారు. నలువది దినములైన తరువాత అపవాది ఆయనను శోధించుటకు ఆయన దగ్గరకు వచ్చాడు. ఆ గొప్ప ఆత్మీయ ఘర్షణ సమయములో యేసు పాతనిబంధన లేఖనములనుపయోగించి తగిన శక్తిని,నడిపింపును పొందారు.

అపవాది ఆయనను ముమ్మారు శోధించాడు. ముమ్మారు ఆయన లేఖనములనుపయోగించి దానిని జయించారు.పాతనిబంధన లేఖనములలోని సత్యములపై ఆయన ఆధారపడ్డారు. "నీవు దేవుని కుమారుడవైతే ఈరాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపింపుము"అని చెప్పుచు అపవాది ఆయనను శోధించుటకు మొదలు పెట్టాడు(మత్తయి 4:3).

ఆ సమయమందు యేసు ఎంతో ఆకలితో యున్నారు.ఇక్కడ యేసుకే కాదు మనకును గొప్పశోధన యున్నది.ఆత్మీయ సంతృప్తికంటే తక్షణ భౌతిక సంతృప్తి ముఖ్యమనే శోధన గొప్పది.

అయితే సాతానుడు మానవుడైన యేసును మాత్రమేగాక,మెస్సీయయైన యేసును శోధించుచున్నాడు. రాళ్లను రొట్టెలుగా చేసికొని తినుటలో యేసు యొక్క భౌతిక ఆకలి తీరడమే గాక,మానవజాతికి తక్షణమే రొట్టె అందించే ఆయన శక్తిని నిరూపించు మని అతడు శోధించాడు. ప్రజలకు కావలసినదేదో వారికియ్యి,వారు నిన్ను వెంబడిస్తారు!క్రైస్తవ మతంలో యిది నిత్యము వుండే శోధన,యేసునందు విశ్వాసముంచుము,నీవు ధనవంతుడగుదువు,గొప్ప పేరుప్రఖ్యాతులు కలవాడగుదువు.అయితే యేసు లేఖనముల నెరిగియున్నందునను,మోషే వారికి

చెప్పిన మాటలను ఎరిగి యున్నందున ను యేసు వానికి లేఖనముల ద్వారా జవాబిచ్చారు."మనుష్యుడు రొట్టెవలన మాత్రమే జీవించడు గాని దేవుని నోటనుండి వచ్చుప్రతిమాట వలన జీవించును" (మత్తయి 4:4;ద్వితీ 8:1-5).

ఆహార విషయంలో సంభవించు కరువుకంటే ఘోరమైన కరువున్నదని యేసు ఎరుగును.అది వాక్యలేమి వలన కలుగు క్షామము. "రాబోవు దినములలో దేశములో నేను క్షామము పుట్టింతును,అది అన్నపానములు లేకపోవుటచేత కలుగు క్షామము కాక యెహోవా మాటను వినకపోవుట వలన కలుగుక్షామముగా ఉండును; ఇదే యెహోవా వాక్కు" (ఆమోసు 8:11,12).

రొట్టెవలన కడుపునిండును గానిఆత్మ కాదు:

యేసు వాక్యము నెరుగును. రొట్టెవలన ఒకని కడుపునిండితే ఆత్మ నిండదని ఆయన ఎరుగును.ఆయన ప్రవక్త చెప్పినమాటలను వినుచుపెరిగారు:"దప్పిగొనిన వారలారా, నీళ్ల యొద్దకు రండి,రూకలు లేనివారలారా మీరు వచ్చికొని భోజనము చేయుడి; రండి రూకలు లేకపోయినను ఏమియు నియ్యకయే ద్రాక్షరసమును, పాలను కొనుడి.ఆహారము కాని దాని కొరకు మీరేల రూకలిచ్చెదరు? సంతుష్టి కలుగజేయనిదాని కొరకు మీ కష్టార్జితమునుఎందుకు వ్యయ పరచెదరు? నా మాట జాగ్రత్తగా ఆలకించిమంచి పదార్థము భుజించుడి. మీ ప్రాణము సారమైన దానియందు సుఖింప నియ్యుడి" (యెషయా 53:1-3).

యేసు మొదటి అరణ్య శోధనను జయించుటయేగాక, ఆ సత్య ములనే తన బోధతో నింపుటకాయన ఆరంభించారు. "కాబట్టి మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకుడి; అప్పుడవన్నియు మీకు అనుగ్రహింప బడును"(మత్తయి 6:33),క్షయమగు ఆహారమకొరకు గాక నిత్యజీవమునిచ్చు అక్షయమైన ఆహారము కొరకు కష్టపడుడి(యోహాను 6:27)యని ఆయన బోధించారు.

యేసును మొదటి శోధనలో ఓడించలేకపోయి నందున సాతానుడు రెండవశోధనను ఆయనపై ప్రయోగించాడు."నీవు దేవుని కుమారుడవైతే క్రిందకి దుముకుము,ఆయన నిన్నుగూర్చితన దూతలకాజ్ఞాపించును అని వ్రాయ బడియున్నదని చెప్పుచు దేవుని మాటలనే వాడు వినియో గించాడు.హవ్వ దగ్గర వినియోగించిన అస్త్రాన్నే ఇక్కడ

కూడవాడు వినియోగించాడు. మరల కీర్తన 91:11ను సాతానుడు ప్రభువుకు వల్లించాడు. "ఆయన నిన్ను గూర్చి తన దూతలకాజ్ఞాపించును,నీ పాదమెప్పుడైన రాతికి తగులకుండ వారు నిన్ను చేతులతో ఎత్తి పట్టుకొందురు" (మత్తయి 4:5-6).

**అభ్యర్థించుదువా? ఆధారపడ్తావా?**

దేవునిశక్తినందు విశ్వాస ముంచు వారికిదొక గొప్పశోధన. దేవునిపై ఆధారపడే వారిగ యుండుట కంటే అభ్యర్థించుటే వారి లక్షణము నిజమే,దేవుడు కీడునుండి మనలను తప్పించగలరు. మనలను స్వస్థపరచ గలరు, తన కార్యములను బట్టి మన అవుసరములను తీర్చగలరు. అదేరీతిగా మనం కోరినవన్నీ లేక కోరిన వేమి ఇయ్యకుండుటకు కూడ ఆయన నిశ్చయించుకొనగలరు.

**దేవునియందు నమ్మకముంచు, పరీక్షించకు.**

యేసు సాతానుకు స్పందించిన దానినిబట్టి సాతాను యేమి చేయబడు టకు ప్రయత్నించుచున్నాడో అర్థము చేసికొనగలము."నీ దేవుడైన ప్రభువును శోధింపవలదు" అని యేసు చెప్పారు (మత్తయి 4:7).ద్వితీ 6:10ను ప్రభువు ఇక్కడ ఎత్తి చెప్పారు. ఇశ్రాయేలీయులు అరణ్యములోయెహోవాను శోధించారు. త్రాగుటకునీళ్లు లేకపోతే వారు మోషే మీదను దేవుని మీదను సణిగారు. "ఇదెందుకు? మమ్మును మా పిల్లలను మా పశువులను దప్పిచేత చంపుటకు ఐగుప్తులోనుండి ఇక్కడికి తీసికొని వచ్చితిరనిరి" (నిర్గమ 17:5). సంగతులు అనుకూలించనప్పుడు వారి విశ్వాసము గల్లంతైనది. దేవుడు వేంటనే వారిని ఆదుకొనకపోతే వారాయనను శంకించారు. యేసుకు లేఖనాలు తెలుసు. ఇశ్రాయేలీయుల నుండి గ్రహించిన సత్యములనాయన ఎరుగును.

యేసు లేఖనములను నమ్ముట ద్వారా,వాటిపై ఆధారపడుట ద్వారా ఈ శోధనను జయించారు. ఆ పాఠము లనాయన తన శిష్యులకు బోధింప సాగారు."వ్యభిచారులైన చెడ్డతరము వారు సూచకక్రియను అడుగు చున్నారు" (మత్తయి 12:39). మన విశ్వాసము సూచకక్రియల మీదకాదు గాని దేవుని యందుంచాలని యేసు బోధించారు. యేసు మీరు నన్నుచూచి నమ్మితిరి, చూడక నమ్మినవారు ధన్యులని తన శిష్యులకుపదేశించారు (యోహాను 20:29).

ఇక్కడ చాల ప్రాముఖ్యమైన నిశ్చయాన్ని మనం చేసికోవాలి. సాతాను

మతమునా?లేక క్రీస్తు మార్గమునా?

ప్రజలేమి కోరుచున్నారో దానిని మెస్సీయయైన యేసు ఇవ్వాలని సాతానుడు కోరాడు. వాళ్లెప్పుడు కోరుకొనినా దానిని వెంటనే,తక్షణమే ఇయ్యాలని వాడు కోరాడు. అయితే దేవుడేమై యున్నారో దానిని బట్టియే గాని,ఆయన నుండి యేమిపొంద గలమో అను దానినిబట్టి మనం దేవుని ప్రేమించాలని యేసు కోరుకొన్నారు.

ఇప్పుడు సాతానుడు ఎలాగైనా యేసుపై విజయం సాధించాలని పట్టుదలకలిగి యున్నాడు. వాడాయనను మిగుల ఎత్తయిన యొక కొండమీదికి తోడుకొనిపోయి యీలోక రాజ్యములన్నిటిని,వాటి మహిమను ఆయనకు చూపి, నీవుసాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల వీటినన్నిటిని నీకిచ్చెదనని చెప్పెను(మత్త4:9). యిది సాతానుకు సాధ్యమే. అయితే మన నిర్ణయం యేమిటి?మనం ఎవరిని ఆరాధిస్తాము?మనకు ఏ రకమైన దేవుడు కావాలి?నిజానికి;నీవు అయితే దేవునికి లేకపోతే సాతానుకు సేవ చేస్తావు.

యేసు ఎవరిని సేవిస్తారోఅను మానం యేమిలేదు."యేసువానితో-సాతానా పొమ్ము,ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవించవలెను అని వ్రాయబడి యున్నదనెను"(మత్తయి 4:10). అపవాదిని జయించుటకు యేసుప్రభువు లేఖనములను వినియోగించారు. లేఖనములను ఆయన బాగుగా ఎరిగియుండెను.

క్రొత్తనిబంధన క్రైస్తవులమైన మనం పాతనిబంధనవలన మనకు యేమీ ప్రయోజనం లేదనుకొంటాము. అయితే ప్రవక్తల ద్వారా మాటలాడిన దేవుడు తనకుమారుడైన క్రీస్తుద్వారా మనతో మాటలాడుచున్నారని గ్రహింతము. ఆయనలో మార్పులేదు, రోషముగల పాతనిబంధన దేవుడు, ప్రేమగల క్రొత్త నిబంధన దేవుడు వేర్వేరుకాదు. పాతనిబంధన ధర్మశాస్త్రమును గూర్చి కొత్తనిబంధన కృపను గూర్చి యున్నవి కాదు. మానవుడెల్లప్పుడు దేవుని కృపలోనే జీవించాడు, జీవిస్తాడు,దేవునివాక్యము ఎల్లప్పుడు యేమి చెప్పెనో, అదే ఇప్పుడు చేస్తాది. మనకు పరిపూర్ణ మార్గమును చూపిస్తాది. మనకు పాపమును ఎత్తి చూపిస్తాది. ఖండిస్తాది,కృపను ప్రదర్శిస్తాది.

"దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును,తప్పుదిద్దుటకును,నీతి యందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైయున్నది"యని అపొస్తలుడు చెప్పినమాట సత్యము. సాతాను యొక్క

వాడిని ఎదుర్కొనుటకు యేసుకు శక్తి అవునరమైనప్పుడు ఆయన లేఖ నములను,పాతనిబంధన లేఖనముల నుపయోగించారు.ఆ సత్యములే నేడు మనకు రొట్టెకంటె ప్రాముఖ్యము.నేడు మనము సాతాను యొక్క శోధనలను ఎదుర్కొనుటకు ప్రయత్నించుచుండగా లేఖనములనుండి నేర్చుకొనిన గొప్ప సత్యములు శక్తిని చేకూర్చును.

"ఏలయనగా ఓర్పువలనను లేఖనముల వలన ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వ మందు వ్రాయబడినవన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి"(రోమా15:4).

-డేవిడ్ లాంగ్‌ఫోర్డ్

## బిడ్డలను యేసునొద్దకు తీసికొని రండి
## *(Bring Children to Jesus)*

చిన్నవారికి యేసు యొక్క స్పర్శ అవునరము. దేవుని రాజ్యమును అంగీకరించుటయెట్లోవారు మనకు నేర్పుదురు. యేసుక్రీస్తురాజై యున్నారు.

"తమ బిడ్డలను ముట్టుకొనవ లెనని కొందరు యేసు నొద్దకు వారిని తీసికొని వచ్చిరి. అయితే శిష్యులు వారిని తీసికొనివచ్చిన వారిని గద్దించిరి. యేసు అది చూచి కోపపడి చిన్నబిడ్డలను నా యొద్దకు రానియ్యుడి,వారినాటంక పరచవద్దు; దేవుని రాజ్యము ఈలాంటివారిదే, చిన్నబిడ్డలవలె దేవుని రాజ్యము నంగీకరింపనివాడు అందులో ఎంతమాత్రము ప్రవేశింపడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని చెప్పి ఆ బిడ్డలను ఎత్తికౌగలించుకొని వారి మీద చేతులుంచి ఆశీర్వదించెను" (మార్కు 10:13-16).

ఆ బిడ్డల వయస్సెంతో మనకు చెప్పబడలేదు గాని వారు 12ఏండ్లు కంటే చిన్నవారై యుండ వచ్చును.యూదుల లెక్కప్రకారము అది బాధ్యతా యుక్త వయస్సు,యేసువారిని ముట్టు కొంటే యేమి జరుగునో వారి తలిదండ్రులు విన్నారు,చూచారు,అను భవించారు. ఆయన ముట్టుకొంటే కుష్ట రోగి బాగుపడ్డాడు(మార్కు 1:41). వ్యాధులు బాగయ్యాయి(మార్కు3:10); అనేకులు స్వస్థతనొందారు(మార్కు 6:56).మరియు మూగవారు మాట్లా డారు,చెవిటివారు వినగల్గారు(మార్కు 7:32-37).

అయితే యేసు శిష్యులు ఈ చిన్నబిడ్డలను ఆయన దగ్గరకు రాకుండ ఆటంకపరిచారు. యేసునొద్ద కు వారిని తీసికొనివచ్చిన వారిని గద్దించారు. ఎందువలన? చిన్నబిడ్డలతో సమయం గడపడానికి యేసుకు వీలుకాదని బహుశవారు తలంచారు.

కొన్నిసార్లు తలిదండ్రులు వారి సమయమే ప్రశస్తమైనదని యెంచి తమబిడ్డలను యేసునొద్దకు తీసుకొని రారు. బైబిలును వారికి బోధించరు. అయితే చిన్నవయస్సులోనే పిల్లలు ఎక్కువ నేర్చుకొంటారు; తద్వారా వారి మనసులలో నదభిప్రాయము లేర్పడతాయి. ఆయన శిష్యులు చిన్నవారిని ఆటంకపరచడము యేసు చూచి ఆయన వారిపై కోపపడ్డారు. నిజానికికోపముతో మండిపడ్డారు. చిన్న బిడ్డలు ఆయన యొద్దకుతీసికొని రాబడ వలెనని యేసు కాంక్షించారు(మార్కు 10:14).

చిన్నబిడ్డలను యేసునొద్దకు తీసికొని రావడమంటే వారిని సండే స్కూలుకు తీసికొని వచ్చుట మాత్రమే కాదు. లేదా ఆరాధనకు తీసికొని వచ్చుట కాదు. అట్లు చేయుట మంచిదే గాని నిజానికి వారు యేసును తెలుసికొను నట్లు చేయాలి. వారాయన మాటలలోని శక్తిని గ్రహించునట్లు చేయాలి. తద్వారా వారు యేసు యొక్క ప్రేమను,శక్తిని తెలుసి కొనగలరు. గృహములో యిచ్చు బైబిలు శిక్షణ, ఉపదేశము వలన యిది సాధ్యమగును. అన్నిటికంటే ముఖ్యముగా తలిదండ్రు, వృద్ధుల యొక్క జీవితము ద్వారా బిడ్డలు ఎంతోనేర్చు కొనగలరు. వారు చిన్నపిల్లల కండ్ల యెదుట క్రీస్తు యొక్క జీవితాన్ని జీవిస్తే, బిడ్డలు సులభంగా వారిని అనుకరిస్తారు (ఎఫెసీ 6:1-4; ద్వితీ 6:6-9; సామె 22:6).

చిన్నబిడ్డలుమంచి మనస్సును ప్రదర్శిస్తారు. ప్రతి విషయానికి వారు ఇంకొకరిపై ఆధారపడియున్నామని వారు ఎరిగియుందురు. మొదట్లో వారికి తెలిసినదంతా యితరులపై సంపూర్తిగ ఆధారపడి యున్నామ ననదియే(మార్కు 10:15). వారు నమ్ముతారు, నిష్కల్మషులు, నిష్కపటులు, పవిత్రహృదయులు, ఆనందభరితులు. యివి యేసు శిష్యుల యొక్క గుణగణాలు. వారు యేసును రాజుగాను, వారిఏకైక నిరీక్షణగాను చూచుదురు.

అయితే చిన్నబిడ్డలు యేసు నుండి దూరపరచబడిన యెడల, ఆయనస్పర్శ నుండి ఆటంకపరచబడిన యెడల,వారిని ఈ లోకము ముట్టుకొంటాది. తలిదండ్రులు యేసును గూర్చి చిన్ననాడే వారికి బోధించకపోతే, ఆయన వాక్యమును నేర్పించకపోతే, సాతాను పనివారు అసూయ,ద్వేషము, అబద్ధములు,బూతులు,పోకిరిచేష్టలు మొదలగునవి వారికి నేర్పుదురు.గనుక ఇట్టి సంగతులు చిన్నవారు తమ తలిదండ్రుల నుండి నేర్చుకొనకుండా జాగ్రత్తపడాలి.యేసు ఒక నిశితమైన హెచ్చరిక యిచ్చారు.చిన్నబిడ్డల వలె మనం ఆయన నంగీకరించకపోతే, వారిని సన్మార్గమున నడిపించలేకపోతే, మనం ఆయన ప్రజలము కాదు!

యేసు సంతోషదాయకరమైన నిర్ధారణ మనకు యిచ్చారు.

"ఆయన ఆ బిడ్డలను ఎత్తి కౌగలించుకొని,వారిమీద చేతులుంచి వారిని ఆశీర్వదించెను"(మార్కు 10:16). యేసును మన జీవితంలో రాజుగా అంగీకరించిన యెడల ఆయన స్పర్శవలన మన పాపములు క్షమించబడును (అపొ.కా. 2:38). ఆయన ఆదరణ మనకు లభించును (అపొ.కా. 2:47). మరియు ఆయన మాత్రమే యియ్యగల రక్షణనొందుదము(అపొ.కా. 4:12).

-జిమ్ పొలార్డ్

**గమనిక :**

**సత్యవాక్కు సాలు చందా మీరు ఇంకను పంపని యెడల వెంటనే పంపించండి. మీ బంధు మిత్రులు ఈ పత్రిక చదివేలాగున ప్రోత్సహించండి.**

**- ఎడిటర్**

# నీరు ప్రాముఖ్యము
## (Water is Important)

మానవుని జీవితంలో నీరు చాలా ప్రాముఖ్యము. దేవుడు మొదట నీటిని చేసారు. తదుపరి నేలమంటితో మానవుని సృజించారు. నీరులేకుండా మన్నుముద్ద అవ్వదు. నీటిలో శక్తి యున్నది.

కారుకు నీరు అవసరం. ఆ నీటిలో శక్తియున్నది. నీవు దేవునిని నమ్మకపోతే నీకారులో రేడియేటర్ లేకుండా ప్రయాణించి చూడు, కొంత సేపటికి నీకారు కాలిపోవును. నీరు లేకుండా ఎవనినైనా పరలోకం పంపుటకు ప్రయత్నించు, అతడా కారువలె కాలిపోవును. నీరు లేకుండా పరలోకంవెళ్లెదం అనుకుంటే, అట్టి సంఘము కాలి బూడిదయై పోవును.

బాప్తిస్మము పొందకముందే రక్షింపబడితిమని కొందరు చెబుతారు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని యేసుక్రీస్తు చెప్పారు(మార్కు 16:16). బాప్తిస్మము పొందకముందే రక్షింపబడితినని నీవు చెప్పుకొనతగదు. ఏలయనగా అది దేవుడు అబద్ధికుడని చెప్పినయట్లగును. మానవుడు అబద్ధికుడు గాని దేవుడు ఎన్నడు అబద్ధికుడుకాడు.

మనుష్యుడు ముందు రక్షింపబడి తదుపరి బాప్తిస్మము పొందునని కొందరుచెబుతారు. శుభ్రముగా యున్న బట్టలను ఎవరు ఉదుకరు. ఎవరైన మురికి బట్టలనే ఉదుకుతారు, మానవుడు పాపపుమురికిని ఉదుకుకొనుటకు బాప్తిస్మము పొందాలి. అతడు శుభ్రము చేయబడాలి.

సువార్తలో మింగవలసిన అయిదు మాత్రలున్నాయి. యివి దేనినయిన బాగుచేస్తాయి. మొదటి మాత్ర సువార్తను వినుము, రెండవది విశ్వసించుము, మూడవది మారు మనస్సు పొందుము. నాల్గవది యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనుము, ఐదవది బాప్తిస్మము పొందుము. వీటిని నీటి ద్వారా సేవించుము. అప్పుడు నీ పాపపు రోగము కుదుటబడును.

- మార్షల్ కీబుల్

## సంక్షిప్త వార్తలు

2015 నవంబరు 3,4,5,6 తేదీలలో కాకినాడ సత్యవాణి-క్రీస్తుసంఘ ఆవరణలో బైబిలులెక్చర్‌షిప్ ఘనముగా నిర్వహించబడెను.ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం,సాయంత్రము కూటములు జరుగగా పలు ప్రాంతములనుండి సువార్తికులు, సంఘములు,తదితరులు హాజరై చక్కటి ఆత్మీయానుభూతిని పొందిరి.సోదరులు, వి.చిన్నయ్య(కడలి),పి.జె,కృపాలిని(పలివెల),రాజనాయగం(తమిళ్‌నాడు),బెర్నీమార్టిన్ (తమిళ్‌నాడు),రోజర్‌రైట్ మరియు లూయిస్‌రష్‌మోర్ గార్లు వాక్యపరిచర్యచేసిరి.ప్రతి కూటమునకు వందలాదిమంది హాజరైరి.మొత్తము నాలుగువేలమంది వరకు హాజరై దేవుని స్తుతించిరి.స్థానిక సంఘము ప్రతిపూట రుచి,శుచి కరమైన ఆహారమును అందరికీ సరఫరా చేయగల్గిరి.స్థానిక సంఘములోయున్న అనేక సోదరసోదరీలు కష్టించి,పనిచేసి బైబిలు లెక్చర్‌షిప్‌ను ఘనముగా నిర్వహించిరి.

2015 నవంబరు 9వ తేదీనాడు రిక్కీగూటంగారు,రోజర్ రైట్ గారు‌లు బయలుదేరి 13వ తేదీ వరకు కర్నాటకలో గొప్ప సువార్త సేవ చేసిరి.బళ్లారి,హోస్పేట, హంపి మొదలగు ప్రాంతములు పర్యటించి,బైబిలుకాస్లులు నిర్వహించి,14వ తేదీ ఉదయానికి వరంగల్లు పట్టణమునకు చేరుకొనిరి.

2015 నవంబరు 14,15 తేదీలలో వరంగల్లులో జరిగిన సువార్తకూటములు, బైబిలుక్లాసులు, సహవాసకూటములలో రోజర్‌రైట్‌గారు,రిక్కీగూటంగారు, జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి.వరంగల్లులో చెన్నారెడ్డికోలనీలోను, రాంపూరు,జక్కులొద్ది ప్రాంతములలోను గొర్రె ప్రసాద్ గారి ఆధ్వర్యమున చక్కటి సువార్తకూటములు నిర్వహింపబడెను. జాషువాగూటం గారు,రిక్కీగారు సతీసమేతముగా ఈ కూటములన్నిటికీ హాజరైరి.

2015 నవంబరు 16,17,18 తేదీలలో రిక్కీగూటం గారు రోజర్‌రైట్‌గారు. కరీంనగర్‌జిల్లాలో పర్యటించి వాక్యపరిచర్య చేసిరి.కరీంనగర్‌లో సోదరులు గొట్టిముక్కల అబ్రాహాము గారు,వారి కుమారులును ఎంతో ఆసక్తితో ఈ సువార్త కార్యక్రమములో పాలుపొందిరి.తదుపరి సుంచు డేవిడ్, జంగిలి యోనా, పసువుల దానియేలు, మచ్చా డేవిడ్‌గార్లను వారి స్వగ్రామములలో దర్శించి,సోదరులను వాక్యములో బలపరచిరి. 19వ తేదీ రాత్రి రోజర్‌రైట్ గారు అమెరికాకు తిరిగివెళ్లిరి.

2015 నవంబరు 25వ తేదీ బుధవారం రంగారెడ్డిజిల్లా బాటసింగారం గ్రామములో సోదరులు టి.వి.సాంసన్‌రాజు గారి ఆధ్వర్యమున ఆంధ్ర,తెలంగాణ సువార్తికుల సహవాస కూడికజరిగెను. వందలాది సువార్తికులు హాజరై"వెనుక నున్నవి మరచి ముందుకు సాగుదము"(ఫిలిప్పీ 3:13,14)అను అంశముపై పలువురు సోదరులు ప్రసంగించగా ముగ్ధులైరి. సేంసన్‌రాజుగారు,స్థానిక సంఘము వచ్చినవారందరికీ మంచి ప్రేమవిందునేర్పాటు చేసిరి. కొందరు సువార్తికులను ప్రత్యేకముగా సన్మానించిరి. జాషువా దంపతులు కూడ హాజరై అక్కడ వాక్యపరిచర్య చేసి 26వ తేదీ ఉదయానికి కాకినాడకు క్షేమముగా చేరుకొనిరి.

ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో అనేకులుచేరి,పాఠములను పూర్తిచేసి బైబిలుప్రతిని ఉచితముగా పొందుచున్నారు. ఈసదవకాశమును ప్రతిస్థానిక సంఘము సద్వినియోగము చేసికొనవలెనని జాషువాగూటం గారు పలు సువార్త కూటములలో హెచ్చరించుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.